క్లుప్తంగా

వైభవంగా బ్రహ్మోత్సవాలు



పాల్గొన్న భక్తులు

మనుబోలు: సంగమేశ్వర బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం అర్ధరాత్రి సప్రోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మనుబోలు శివాలయం నుంచి సూలప్ప (పెళ్లి పెద్ద)ను భక్తులు భుజాలపై మోస్తూ కండలేరు ఒడ్డునున్న సంగమేశ్వరాలయానికి తీసుకెళ్లారు. యువత ఉత్సవం వెంట సందడి చేసింది. నేడు రావణ సేవ, 12న నందిసేవ, 13న రథోత్సవం, 14న కల్యాణం, 15న పార్వేట, 16న వసంతోత్సవం, 17న ఏకాంతసేవలను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు.

బాబా మందిరంలో విశేష పూజలు



పొదలకూరు: పట్టణంలోని షిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి పల్లకి సేవ జరిగింది.

డయల్ యువర్ డీఎం-1 నేడు

నెల్లూరు సిటీ: ఆర్టీసీ డిపో-1 పరిధిలో సమస్యలు, సూచనలను తెలిపేందుకు శుక్రవారం డయల్ యువర్ డీఎం-1 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ మురళీకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్య కార్యక్రమం జరుగుతుందన్నారు. 99592 25641 నంబర్‌కు ఫోన్ చేయవచ్చన్నారు.

ఆశా వర్కర్ల సదస్సు రేపు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నేషనల్ హెల్త్ మిషనరీ స్కీమ్ (ఎన్‌హెచ్‌ఎం) ఏర్పాటై 20 ఏళ్ల పూర్తయిన సందర్భంగా ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ సాధించిన విజయాలపై శనివారం నగరంలో సదస్సు ఉంటుందని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణమ్మ గురువారం తెలిపారు. బాలాజీనగర్‌లోని రామచంద్రారెడ్డి భవన్‌లో నిర్వహించే సదస్సుకు యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి హాజరు కానున్నారని, జిల్లాలోని ఆశా వర్కర్లు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

13న సాహితీ పురస్కారాల ప్రదానం

నెల్లూరు(బృందావనం): పుర మందిరంలోని ఏసీ హాల్లో ఈనెల 13న సాహితీ పురస్కారాల ప్రదానం ఉంటుందని చిన్ని నారాయణరావు సాహితీ ఫౌండేషన్ అధ్యక్షుడు నారాయణరావు గురువారం తెలిపారు. సాయంత్రం 5 గంటలకు కవి సమ్మేళనం, సాహిత్య సదస్సులు, సత్కారాలు జరుగుతాయన్నారు.

కర్నూలుకు ఏసీ బస్సును ఏర్పాటు చేయండి

నెల్లూరు సిటీ: వేసవి నేపథ్యంలో నెల్లూరు-కర్నూలు మధ్య ఏసీ బస్సును ఏర్పాటు చేయాలని నగరానికి చెందిన ఎస్.సాయి యామిని కోరారు. నగరంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో 'డయల్ యువర్ డీఎం-2' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ శివకేశవ్ యాదవ్ ప్రయాణికుల సమస్యలను తెలుసుకున్నారు. ఒక్క ఫోన్ కాల్ మాత్రమే రావడంతో ఆమె సూచనలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు : ఎస్ఈ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): వేసవిలో రైతులు, వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల పనులను యుద్ధప్రాతిపదికన చేయాలని ఎస్పీడీసీఎల్ జిల్లా ఎస్ఈ విజయన్ ఆదేశించారు. నగరంలోని విద్యుత్ భవన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రాల అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో నెల్లూరు, కావలి, ఆత్మకూరు ప్రాంతాల్లో మూడు ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రాలు ఉన్నాయన్నారు. ఆయా కేంద్రాలు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. గత ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో మరమ్మతులకు గురైన 5,810 ట్రాన్స్‌ఫార్మర్లను రిపేర్లు చేసినట్లు వివరించారు. సమావేశంలో ట్రాన్స్‌ఫార్మర్ల ఈఈ లక్ష్మీనారాయణ, డిప్యూటీ ఈఈ అల్తాఫ్ పాల్గొన్నారు.

కష్టాల సుడిలో గంగపుత్రులు

- తగ్గిపోయిన మత్స్య సంపద
- చేపల వేట ఒక్క పూటే
- ఆందోళనలో మత్స్యకారులు
- ప్రాజెక్టులో పనికి కొందరు.. ఇతర రాష్ట్రాలకు మరికొందరు

మండలం	ఫైబర్ బోట్ల సంఖ్య
ముత్తుకూరు	425
తోటపల్లిగూడూరు	651



తీరంలో నిలిపిన ఫైబర్ బోట్లు

ముత్తుకూరు, తోటపల్లిగూడూరు మండలాల్లోని మత్స్యకారుల పరిస్థితి దారుణంగా మారింది. సముద్రంలో ఒకప్పటిలా మత్స్య సంపద దొరకడం లేదు. ఇక్కడ వేట నిషేధం మొదలవగానే కొందరు ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. మరికొందరు ప్రాజెక్టుల్లో పనులకు వెళ్తున్నారు.

ముత్తుకూరు: బంగాళాఖాతంలో వేట చేసే మత్స్యకారులకు రొయ్యలు లభించడమే గగనమైపోయింది. పది సంవత్సరాల క్రితం మరపడవలు సముద్రంలో ఏడు నుంచి 10 రోజులపాటు వేట చేసేవి. టన్నుల కొద్దీ రొయ్యలు లభించేవి. ఈ పరిస్థితి క్రమంగా కనుమరుగైపోయింది. ప్రస్తుతం ముత్తుకూరు, తోటపల్లిగూడూరు మండల మత్స్యకారులు ఫైబర్ ఇంజిన్ బోట్ల ద్వారా ఒకపూట మాత్రమే సముద్రంలో చేపల వేట సాగిస్తున్నారు. వేకువజాము నుంచి మధ్యాహ్నం వరకు గానీ, మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు గానీ వేట చేస్తున్నారు. దొరికిన చేపలతో ఇంటికి చేరే దుస్థితి నెలకొంది. రొయ్యలు లభించే రోజుల్లో రాజుగా జీవించిన గంగపుత్రులు ప్రస్తుతం 50 నుంచి 60 కిలోలు మాత్రమే లభించే చేపలతో కాలం నెట్టుకొస్తున్నారు. చేపలు సమృద్ధిగా లభిస్తే మరుసటిరోజు కూడా వేటకు వెళ్తారు. పది కిలోలు కూడా లభించకపోతే డీజిల్ ఖర్చులకు కూడా గిట్టుబాటు కాదు. ఈ సందర్భాల్లో డీలా పడిపోతున్నారు. మరుసటి రోజు వేటకు వెళ్లలేని పరిస్థితులున్నాయి

ప్రాజెక్టుల్లో పనులకు వెళ్తూ..

సముద్రంలో చేపల వేట ఆశాజనకంగా లేకపోవడంతో ఈ రెండు మండలాలకు చెందిన కొందరు మత్స్యకారులు థర్మల్ ప్రాజెక్టులు, పోర్టు తదితర వాటిల్లో పనులకు వెళ్తున్నారు. కొందరు కేరళ, కర్నాటక రాష్ట్రాలకు తరలిపోయారు. ఆయా ప్రాంతాల పడవల్లో వేట సాగిస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆ రాష్ట్రాల్లో జూన్ ఒకటో తేదీ నుంచి చేపల వేటపై నిషేధం విధిస్తారు. దీంతో ఏప్రిల్ 15వ తేదీ తర్వాత చాలామంది మత్స్యకారులు వేట చేసేందుకు ఈ రెండు రాష్ట్రాలకు తరలిపోయేందుకు సిద్ధంగా ఉన్నారు. చేపల వేట లాభదాయకంగా లేదని నిర్ణయించుకోవడంతో కొందరు గంగపుత్రులు తమ పిల్లలను పాఠశాలలు, కాలేజీలకు పంపించి చదివిస్తున్నారు.

మత్స్యసంపద తగ్గిపోయింది



రాష్ట్ర వ్యాప్తంగా సముద్రంలో మత్స్య సంపద పూర్తిగా తగ్గిపోయింది. రొయ్యలు లభించడమే లేదు. చేపలతో సరిపెట్టుకుంటున్నాం. థర్మల్ ప్రాజెక్టులు సముద్రంలో ఏర్పాటు చేసిన పైపులకు తరచూ మా వలలు చిక్కుకొంటున్నాయి. ఫలితంగా నష్టపోతున్నాం.

– బసవంగారి ఈశ్వరయ్య, నేలటూరు పట్టపుపాళెం

మౌలిక వసతులు కల్పించాలి



సముద్రంలో సజావుగా చేపల వేట చేసేందుకు అవసరమైన వసతులను ప్రభుత్వం కల్పించాలి. ముఖ్యంగా ఫిషింగ్ జెట్టీ నిర్మాణం పూర్తి చేయాలి. సముద్రం వరకు పటిష్టమైన రోడ్డు నిర్మించాలి. చేపలు ఎండబెట్టుకునేందుకు, భద్రపరిచేందుకు సౌకర్యాలు ఏర్పాటు చేయాలి.

– బుచ్చంగారి పోలయ్య, ఆర్కాట్‌పాళెం పట్టపుపాళెం



ఒడ్డున ఉన్న పడవలు (ఫైల్)



సముద్రంలో లభించిన రొయ్యలు (ఫైల్)

ఈనెల 13న ప్రవేశపరీక్ష

ముత్తుకూరు: ముత్తుకూరులోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 2025 – 26 సంవత్సరానికి 5వ తరగతి, జూనియర్ ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 13వ తేదీన ప్రవేశపరీక్ష జరుగుతుందని ప్రిన్సిపల్ సుజాత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతికి సంబంధిత కేంద్రంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, జూనియర్ ఇంటర్‌కు మధ్యాహ్నం మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. హాల్‌టికెట్, ఆధార్‌కార్డుతో హాజరు కావాలని సూచించారు.

డిగ్రీ పరీక్షలకు 478 మంది గైర్హాజరు

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) పరిధిలోని అనుబంధ కళాశాలల్లో గురువారం నిర్వహించిన డిగ్రీ రెండో సెమిస్టర్ పరీక్షలకు 478 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎగ్జామ్స్ నిర్వహణాధికారి డాక్టర్ ఆర్.మధుమతి తెలిపారు. 7,255 మందికి గానూ 6,777 మంది హాజరై.. 478 మంది గైర్హాజరయ్యారని వెల్లడించారు.

వంట గ్యాస్ ధర తగ్గించాలంటూ..



నిరసన తెలుపుతున్న నాయకులు

మనుబోలు: ప్రభుత్వం వంట గ్యాస్ ధరను పెంచి పేదలపై మోయలేని భారాన్ని మోపిందని రైతు సంఘం ఏపీ కార్యదర్శి దేవదానం అన్నారు. గ్యాస్ సిలిండర్ ధర పెంపును నిరసిస్తూ గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే పెట్రోల్, డీజిల్, నిత్యావసరాల ధరలు పెరగడంతో సామాన్యులు బతకడమే కష్టంగా మారిందన్నారు. ఇప్పుడు గ్యాస్ ధరలను పెంచి ప్రభుత్వం పేదల నడ్డి విరుస్తోందని దుయ్యబట్టారు. ధరలను ఉపసంహరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బీసీ భాస్కర్, వెంకటేశ్వర్లు, మునెమ్మ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంను తొలగిస్తేనే హైస్కూల్ ప్లస్ బాగు

- ఆర్టీఏ కింద ఎట్టకేలకు సమాచారం
- మధ్యాహ్న భోజనంలో అవకతవకలున్నాయ్
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి చలపతిరావు



మాట్లాడుతున్న చలపతిరావు

కొడవలూరు: నార్తురాజుపాళెం హైస్కూల్ ప్లస్ హెచ్‌ఎం ఓబులేసును తొలగిస్తేనే పాఠశాల బాగుపడుతుందని, ఆర్టీఏ కింద ఎట్టకేలకు ఇచ్చిన సమాచారంలో ఆయన అవకతవకలు పాల్పడినట్లు తేలిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి వీరి చలపతిరావు అన్నారు. నార్తురాజుపాళెంలోని వీసీఆర్ అతిథి గృహ ప్రాంగణంలో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. హైస్కూల్ ప్లస్ సమాచారం అడిగితే 1,026 పేజీలు ఇస్తామని చెప్పి, డీడీ కట్టించుకున్నారని, అయినప్పటికీ సమాచారమివ్వకుండా మీనమేషాలు లెక్కిస్తుండడంతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. కలెక్టర్ స్పందించి విచారణకు ఆదేశించడంతో హడావుడిగా బుధవారం సమాచారం పంపారన్నారు. అయితే హెచ్‌ఎం చెప్పిన విధంగా కాకుండా 472 పేజీలనే పంపారని వాటిని చూపుతూ చెప్పారు. హైస్కూల్ ప్లస్‌లోని మధ్యాహ్న భోజనాన్ని సర్పంచ్ సుప్రియ బుధవారం తనిఖీ చేయగా మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు 100 మందికి భోజనం వండామని చెబితే హెచ్‌ఎం మాత్రం 200 మందికి భోజనం పెట్టామని చెప్పారన్నారు. ఇక్కడ మధ్యాహ్న భోజనంలోనూ భారీగా అవకతవకలు జరుగుతున్నాయన్నారు. వాస్తవంగా భోజనం చేస్తున్న విద్యార్థుల సంఖ్యకు రికార్డుల్లోని సంఖ్యకు భారీగా వ్యత్యాసాలున్నట్లు అనుమానాలున్నాయన్నారు. హెచ్‌ఎంపై అనేక ఆరోపణలున్న నేపథ్యంలో ఆయన్ను తొలగించాలని కోరారు. సమావేశంలో ఎంపీపీ గాలి జ్యోతి, సర్పంచ్ బి.సుప్రియ, ఎంపీటీసీ సభ్యుడు పోశింరెడ్డి అనిల్‌కుమార్‌రెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు రంతుల్లా, నాయకులు కొండా శ్రీనివాసులురెడ్డి, మాణిక్యరావు, దేవిరెడ్డి సాయిరెడ్డి, పేట మధు, జి.సునీల్ పాల్గొన్నారు.

రెండు ఆలయాల్లో చోరీ

పొదలకూరు: పట్టణానికి సమీపంలోని మనుబోలు రోడ్డు ప్రభుత్వ నిమ్మ మార్కెట్ యార్డు వినాయకుడి దేవాలయంలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. గురువారం వ్యాపారస్తులు వివరాలు వెల్లడించారు. దొంగలు ఆలయ గేటు తాళం తొలగించి లోనికి ప్రవేశించారు. పూజా సామగ్రిని ఎత్తుకెళ్లారు. హుండీలోని నగదును అపహరించేందుకు వీలు కాలేదు. యువకులు హల్‌చల్ చేస్తూ దేవాలయం వద్దకు వచ్చినట్టుగా వ్యాపారులు ఏర్పాటు చేసిన సీసీ టీవీ ఫుటేజీలో రికార్డైంది. ఒకడు దారిలో నాగులపుట్ట వద్ద ఉన్న శూలాన్ని తీసుకుని వీరంగం చేసినట్లుగా గుర్తించారు. గతంలో ఇదే దేవాలయంలో శఠగోపం, పూజా సామగ్రిని దొంగతనం చేశారు. పట్టణంలో బుధవారం రెండిళ్లల్లో భారీ చోరీ జరగడం, యార్డు దేవాలయంలో ఆగంతకులు ప్రవేశించడంతో జనం భీతిల్లుతున్నారు. గృహాల్లో జరిగిన చోరీలపై ఎస్సై హనీఫ్ క్లూస్ టీంను రప్పించి ప్రాథమిక ఆధారాలు సేకరించారు. స్థానికులపై కూడా అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. బాగా తెలిసిన వారే చోరీలకు పాల్పడి ఉంటారనే కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నారు.



వెంకటాచలం: శ్రీకృష్ణ మందిరం

శ్రీకృష్ణ మందిరంలో..

వెంకటాచలం: మండలంలోని వెంకటాచలంలో ఉన్న శ్రీకృష్ణ మందిరంలో గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. శ్రీకృష్ణ మందిరం తాళాలు పగులగొట్టి హుండీలో ఉన్న సుమారు రూ.35 వేల నగదుతోపాటు రెండు సవర్ల బంగారు తాళిబొట్టును ఎత్తుకెళ్లారు. సమీపంలోని రెండు నివాసాల్లో చోరీకి ప్రయత్నించగా కుక్కలు మొరగడంతో భయపడి పరారయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు గురువారం క్లూస్ టీంను రప్పించి వేలిముద్రలు సేకరించారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



మాట్లాడుతున్న ఏపీఎం చిన్నయ్య

పొదలకూరు: గ్రామాల్లో రైతులు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలని వెలుగు ఏపీఎం చిన్నయ్య అన్నారు. ఖరీఫ్ సీజన్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం వ్యవసాయ శాఖతో కలిసి పొదుపు సంఘాలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొదుపు మహిళలు, వీఓఏలు గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాల్సిందిగా సూచించారు. ఏఓ ఎ.వాసు మాట్లాడుతూ మేలైన వ్యవసాయంలో భాగంగా తాము ఎరువుల మోతాదు పూర్తిగా తగ్గించి పంటలను పండించడం జరిగిందన్నారు. సంప్రదాయ ఎరువుల వాడకం వల్ల మనం తీసుకునే ఆహారంలో ఎలాంటి హానికరమైన కారకాలు ఉండవన్నారు. ప్రకృతి వ్యవసాయం కో-ఆర్డినేటర్ సుబ్బయ్య మాట్లాడుతూ ఈ తరహా వ్యవసాయం వల్ల ఖర్చులు గణనీయంగా తగ్గుతాయన్నారు. కార్యక్రమంలో పొదలకూరు ఏడీఏ కె.శివనాయక్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని తప్పక తీసుకోవాలి

ఇందుకూరుపేట : గర్భిణులు, బాలింతలు తప్పక పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ రాజ్యలక్ష్మి కోరారు. మండలంలోని మైపాడులో పౌష్టికాహార పక్షోత్సవాలను గురువారం నిర్వహించారు. తొలుత గ్రామంలో ర్యాలీ చేపట్టారు. అనంతరం పౌష్టికాహార ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

➡ **పొదలకూరు:** మహిళ గర్భం దాల్చిన సమయం నుంచి బిడ్డకు రెండేళ్ల వయసు వచ్చే వరకు ఐసీడీఎస్ సంరక్షణ కల్పించడం జరుగుతుందని సూపర్‌వైజర్ జ్యోతిలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని మర్రిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం అవగాహన కల్పించారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు మోక్షలక్ష్మి, వసుమతి, వెంకటరమణమ్మ, బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

➡ **కొడవలూరు:** బిడ్డకు ఆరునెలల వరకు తల్లి పాలనే పట్టించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.నాగభూషణమ్మ సూచించారు. మండలంలోని నార్తురాజుపాళెంలో పోషణ్ పక్వాడా కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డకు ఆరు నెలల వరకు కేవలం తల్లి పాలనే ఇవ్వడం ఎంతో శ్రేయస్కరమన్నారు. బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెంపొంది అనేక రకాల వ్యాధులకు దూరమవుతారన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కె.విజయమ్మ, వై.రాజమ్మ, వై.మంజుల, ఆర్.సునీత, ఎన్.సుదర్శన, పి.భారతి, హెల్పర్ టి.ప్రసన్నలు పాల్గొన్నారు.



కొడవలూరు : నార్తురాజుపాళెంలో ప్లకార్డుల ప్రదర్శన

➡ **మనుబోలు:** తల్లి పాలే బిడ్డకు శ్రీరామరక్ష అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ అన్నారు. మండలంలోని యాచవరం అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం అవగాహన కల్పించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలున్న ఆహార పదార్థాలను ఎలా తయారు చేసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం నాగరాజు, అంగన్‌వాడీలు లక్ష్మీసుజన, విజయ, నిర్మల, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాల విశిష్టతను గుర్తించాలి

➡ **బుచ్చిరెడ్డిపాళెం రూరల్:** పట్టణంలోని కనిసిరి పాళెం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడా కార్యక్రమం గురువారం జరిగింది. సూపర్‌వైజర్ శకుంతల, హోమియోపతి మెడికల్ ఆఫీసర్ ప్రసూన మాట్లాడుతూ తల్లులు తమ బిడ్డలకు పుట్టిన వెంటనే పాలు పట్టించాలన్నారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్త రాజేశ్వరి, మాధవి పాల్గొన్నారు.



బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : కనిసిరిపాళెంలో..



ఇందుకూరుపేట : ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



మనుబోలు: అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్



పొదలకూరు: మాట్లాడుతున్న జ్యోతిలక్ష్మి

బీజేపీ పట్టణ కమిటీ ఎన్నిక



ఎన్నికైన కమిటీ సభ్యులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: బుచ్చిరెడ్డిపాళెం బీజేపీ పట్టణ కమిటీ ఎన్నిక ఆ పార్టీ మండల కార్యాలయంలో గురువారం జరిగింది. బీజేపీ పట్టణాధ్యక్షుడు కల్యాణ్‌కుమార్ ఆధ్వర్యంలో అనుబంధ సంఘాల కమిటీలను కూడా ప్రకటించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు కర్నాటి ఆంజనేయులు, గడ్డం విజయ్‌కుమార్, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇతర రాష్ట్రాలకు నిమ్మ ఎగుమతులు

- ఆశించిన స్థాయిలో పెరగని ధరలు

పొదలకూరు: వేసవిలో నిమ్మ ధరలు రైతులు ఆశించిన స్థాయిలో పెరగడం లేదు. ప్రస్తుతం ఉన్న ధరలు గిట్టుబాటయ్యేలా ఉన్నా వేసవి సీజన్‌లో ఇంకా పెరిగితే ఆర్థికంగా రైతులు నిలదొక్కుకునే అవకాశం ఉంది. అయితే ఏప్రిల్ రెండో వారంలోనే ఉన్న ధరలు కాస్త దిగజారాయి. ప్రస్తుతం లూజు (బస్తా) ఒకటి రూ.4,800 నుంచి రూ.6,800 వరకు ఉంది. కిలోల లెక్కన పరిశీలిస్తే రూ.60 నుంచి రూ.85 ఉన్నట్టు వ్యాపారులు వెల్లడించారు. సాధారణంగా మార్చి, ఏప్రిల్ నెలల్లో లూజు (బస్తా) టాప్ ధర రూ.10 వేల వరకు పలుకుతోంది. ఈ ఏడాది కాయలకు ఆశించిన స్థాయిలో డిమాండ్ పెరగడం లేదంటున్నారు.

ఎగుమతి

ఢిల్లీ మార్కెట్‌కు గుజరాత్, కర్ణాటక, మధ్యప్రదేశ్, తెలంగాణ తదితర రాష్ట్రాల నుంచి నిమ్మకాయలు ఎగుమతి అవుతున్నాయి. ఫలితంగా కాయలు అధికమై ధరలు తగ్గుతున్నట్టు వ్యాపారులు అభిప్రాయపడుతున్నారు. అయితే ఏపీ నుంచి ఏడాది పొడవునా కాయలు ఎగుమతి అవుతూనే ఉంటాయి. మిగిలిన రాష్ట్రాల నుంచి తోటల్లో కాయలు పెద్దగా దిగబడి కావు. బయటి రాష్ట్రాల కాయల ఎగుమతులు తగ్గిన సమయంలో ఏపీ కాయలకు డిమాండ్ పెరుగుతుంది. దీంతో మార్కెట్‌లో వేసవి సీజన్‌లో సైతం రైతులకు ఆశాజనకమైన ధరలు లభించడం లేదని చెబుతున్నారు.



మార్కెట్‌కు వచ్చిన నిమ్మకాయలు